సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 17 | డిసెంబర్ | 2023



నిష్టతో గోదాదేవి వ్రతం

నేటి నుంచి వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నాయి. భక్తులు గోదాదేవి వ్రతం ఆచరించనున్నారు.

- 8లో▸



భూముల పరిశీలన

ములుగులో గిరిజన యూనివర్సిటీకి కేటాయించిన భూమిని శనివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు పరిశీలించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

30^0 / 18^0

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటినుంచి మేడారానికి ఆర్టీసీ బస్సులు



హన్మకొండ: ములుగు జిల్లా మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మల దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజనల్ మేనేజర్ జాన్సి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఈనెల 17వ తేదీ నుంచి ప్రతీ బుధ, ఆదివారం, సెలవు రోజుల్లో హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంస్థ ప్రగతిలో ఉద్యోగుల పాత్ర కీలకం



హన్మకొండ: సంస్థ ప్రగతిలో ఉద్యోగుల పాత్ర కీలకం అని టీఎస్ ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరంసింగ్ అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని ఆర్టీసీ హనుమకొండ డిపోలో ప్రగతి చక్రం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు డిపో మేనేజర్ ప్రగతి చక్రం అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ధరంసింగ్ మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి శాయశక్తులా కృషి చేసి సంస్థను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ప్రయాణికులతో ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తిస్తూ.. ఆక్యుపెన్సీ రేషియో పెంచాలని చెప్పారు. ఈసందర్భంగా అధిక ఆదాయం తీసుకొచ్చిన కండక్ట ర్లు, అధిక కేఎంపీఎల్ తీసుకొచ్చిన డ్రైవర్లు, టిమ్ డ్రైవర్లకు, మెకానిక్‌లకు నగదు బహుమతి, ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానికల్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, డిప్యూటీ ట్రాఫిక్ సూపర్‌వైజర్లు ఎ.రవీందర్, పులి సదానందం, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కేయూ క్యాంపస్: ఇటీవల చండీఘర్ యూనివర్సిటీలో జరిగిన సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ పోటీల్లో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రెజ్లింగ్ పోటీల్లో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న సయ్యద్ ముబీన్, బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న రెహానా ప్రతిభ చూపి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య తెలిపారు. ఆయా విద్యార్థులను శనివారం కళాశాలలోని తన చాంబర్‌లో అభినందంచారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ గార్డ్స్ పనితీరు బాగుంది



వరంగల్ క్రైం : శాంతి భద్రతలను కాపాడటంలో డిస్ట్రిక్ట్ గార్డ్స్ పనితీరు బాగుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. శనివారం సీపీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డిస్ట్రిక్ట్ గార్డ్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిబ్బంది నిత్యం వ్యాయామం చేయాలని, దేహదారుఢ్యంపై దృష్టి సారించాలని సూచించారు. సిబ్బందికి వ్యక్తిగత సమస్యలు ఉంటే తోటివారికి, అధికారులకు తెలియజేయాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమిస్తూ లక్ష్యం వైపు వెళ్లాలని పేర్కొన్నారు. కీలకమైన సమయాల్లో డిస్ట్రిక్ట్ గార్డ్స్ సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. క్రైం డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు సంజీవ్, ఏసీపీలు రమేష్, నాగయ్య, ఆర్‌ఐలు శ్రీనివాస్, సృజన్‌రాజ్, శ్రీధర్ పాల్గొన్నారు.

నల్లా బిల్.. వసూలు డల్!

- 'ఆస్తి పన్నుపై అధికారులు, సిబ్బందికి టార్గెట్‌లు
- తాగునీటి చార్జీల వసూళ్లలో అలసత్వం



వరంగల్ అర్బన్: నల్లా బిల్లుల వసూళ్లలో బల్దియా అధికారులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొత్త ఇంటి నంబర్లు, ఆస్తుల పేరు మార్పిడి, విభజనపై చూపుతున్న శ్రద్ధ తాగునీటి బిల్లుల వసూళ్లపై చూపట్లేదు. దీంతో ప్రతీ ఏటా బకాయిలు పేరుకుపోతున్నాయి. ఏడాదంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన పన్నుల విభాగం సిబ్బంది తాగునీటి చార్జీలను కేవలం 50 శాతానికి మించి వసూలు చేయట్లేదు. గ్రేటర్ పరిధి 2020–21లో 1,08,505 నల్లా కనెక్షన్లు ఉండగా.. అమృత్ పథకం ద్వారా 2023–34 వరకు 1,80,221కి చేరాయి. తాగునీటి చార్జీలు రూ.16.54 కోట్ల నుంచి రూ.25.68 కోట్లకు చేరాయి. కానీ.. ఆస్తి పన్ను ప్రతీ ఏడాది 80 శాతం మేర వసూలు చేస్తున్న బల్దియా ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు కేవలం 50 శాతం వసూళ్లతో సరిపెట్టడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవసరమైనంత సిబ్బంది ఉన్నా..

ఆస్తి, నీటి పన్నులతోపాటు ఇంటింటా యూజర్ చార్జీలను వసూలు చేసేందుకు అవసరమైనంత మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు, నలుగురు రెవెన్యూ ఆఫీసర్లు, 13 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కాశిబుగ్గ సర్కిల్‌లో 21 మంది బిల్‌కలెక్టర్లు, 50 మంది వరకు ఉన్నారు. కానీ.. ఆశించిన మేర ఆదాయం రాబట్టలేక పోతున్నారు.

లోపం ఎక్కడుందంటే..

పన్ను బకాయిలు పెరిగిపోవడానికి, సక్రమంగా వసూలు చేయకపోవడానికి యంత్రాంగం వైఫల్యమే ప్రధాన కారణం. ప్రజలకు తాఖీదులివ్వడంతోనే సరిపెట్టుకోకుండా సక్రమంగా చెల్లిస్తున్నారా? చెల్లించని వారిపై క్షేత్రస్థాయిలో చర్యలేం తీసుకుంటున్నారు? అనే పర్యవేక్షణ కొరవడుతోంది. తాగునీటి కోసం గ్రేటర్ వరంగల్ ఏటా రూ.30 కోట్ల పైచిలుకు నిధులు వెచ్చిస్తోంది. తాగునీటి డిమాండ్ ఏడాది పాత బకాయిలు, కరెంట్ బకాయిలు మొత్తం రూ.41.41 కోట్లు ఉండగా.. రూ.2.94 కోట్లు వసూలు చేశారు. రూ.38.17 కోట్లు పేరుకుపోయాయి. ఈ ఏడాది పాత బకాయిలు, ప్రస్తుత ఏడాది డిమాండ్ రూ. 54.40కోట్లు ఉండగా.. ఇప్పటి వరకు రూ.6.18 కోట్లు మాత్రమే వసూలు చేశారు. రూ.48.32 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. తాగునీటి చార్జీల వసూళ్లపై ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతోంది.

ప్రత్యేక విభాగం లేకనే..

తాగునీటి బిల్లుల వసూలు కోసం ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేస్తే వసూళ్లలో పురోగతి కనిపిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల నుంచి గట్టెక్కవచ్చనే అభిప్రాయాలు పౌరుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

సంవత్సరం	నల్లా కనెక్షన్లు	మొత్తం బకాయిలు	పెండింగ్ బకాయిలు
2020–21	1,08,505	28.03 కోట్లు	7.05 కోట్లు
2021–22	1,09,197	26.37 కోట్లు	8.48 కోట్లు
2022–23	1,80,252	41.11 కోట్లు	39.17 కోట్లు
2023–24	1,80,221	54.40 కోట్లు	47.60 కోట్లు



రోడ్డెక్కిన స్తంభం

ఈ ఫొటో చూడండి. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాల లైన్. ఇది ఎక్కడో కాదండోయ్ నగర మేయర్ గుండు సుధారాణి డివిజన్‌లోని రామన్నపేటలోనిది. రోడ్డు విస్తరణ చేసినప్పుడు లైన్‌ను పక్కకు మార్చాల్సి ఉన్నప్పటికీ అలానే ఉంచారు. దీంతో స్తంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచి వెళ్లినా నేరుగా వెళ్లి స్తంభానికి ఢీకొట్టాల్సిందే. ఒకేసారి రెండు పెద్ద వాహనాలు వస్తే ఇక అంతే సంగతులు. ఇప్పటికే ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరిగాయి. అధికారులు వెంటనే స్పందించి స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి

సైట్ డైరెక్టర్ విజయలక్ష్మి

విద్యారణ్యపురి: విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయులు ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యాపరమైన కార్యక్రమాల అమలుకు అంకితభావంతో పనిచేయాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ డైరెక్టర్(సైట్), రాష్ట్ర పరిశీలకులు విజయలక్ష్మి అన్నారు. శనివారం హనుమకొండలోని లష్కర్‌బజార్ బాలికల హైస్కూల్‌లో 'ఉన్నతి' కార్యక్రమం అమలుతీరుపై సమీక్షించారు. తొలుత ఏడవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయురాలు గణితం బోధిస్తున్న తీరును, అలాగే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అలాగే 'ఉన్నతి'కి సంబంధించిన రికార్డులను చూశారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ పాల్గొన్నారు.

పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలో..

కాజీపేట మండలం పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో సైట్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను సక్రమంగా పాఠశాలకు పంపిస్తూ వారి చదువు విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. పెద్దలు టీవీ సీరియళ్లు చూడడం వల్ల పిల్లలు కూడా అలవాటు పడతారని, అలాంటివాటికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల బాగుందని, అయితే మధ్యాహ్న భోజనంలో అప్పడప్పుడూ రాళ్లువస్తున్నాయని తెలుపగా.. మళ్లీ సమస్య రాకుండా చూస్తామని హెచ్‌ఎం వివరించినట్లు సమాచారం. డీఈఓ ఎండీ.అబ్దుల్ హై మాట్లాడుతూ అందరం కలిసి సమష్టిగా కృషి చేస్తేనే పిల్లలు ప్రయోజకులవుతారని అన్నారు.



లష్కర్‌బజార్ స్కూల్ స్టాఫ్‌తో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నిట్‌తో సీఎస్‌ఐఆర్–ఐఐఎంటీ ఒప్పందం



ఎంఓయూ పత్రాలతో సీఎస్‌ఐఆర్, నిట్ వరంగల్ డైరెక్టర్లు

కాజీపేట అర్బన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ టెక్నాలజీ భువనేశ్వర్.. నిట్ వరంగల్‌తో శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. వరంగల్ నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన రెండ్రోజుల రేడియో–23 సదస్సు ముగింపులో భాగంగా ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎస్‌ఐఆర్–ఐఐఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ్‌నారాయణ్, నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పరస్పరం ఎంఓయూను అందజేసుకున్నారు. రీసెర్చ్ అండ్ కౌన్సెలింగ్‌తో పాటు పరిశ్రమలకు ఇంజనీర్లను అందించడంలో ఎంఓయూ తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గ్లోరీ స్వరూప, జోషి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

వరంగల్ అర్బన్: అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లులు చెల్లిస్తామని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. హనుమకొండ ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి కమిషనర్ క్షేత్రస్థాయిలో పూర్తయిన పనులను శనివారం తనిఖీ చేశారు. హనుమకొండ బాలసముద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు పనులు, నంది హిల్స్ సమీపంలో కల్వర్టు, డ్రెయిన్ పనులు, శాయంపేటలో డ్రెయిన్ పనుల్ని పరిశీలించారు. ప్రెసిడెన్సీ స్కూల్ సమీపంలో డ్రెయిన్, గోకుల్‌నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి అగ్రిమెంట్‌లో పేర్కొన్న నిబంధనల మేరకు పనుల పూర్తి వివరాలను అధ్యయనం చేశారు. బాలసముద్రంలోని క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాన్ని సందర్శించారు. హనుమకొండలోని బాలసముద్రం, ప్రశాంత్‌నగర్, నంది హిల్స్, హసన్‌పర్తి, భీమారం, నయీంనగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమర్షియల్ నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం నిర్మాణాల్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో డీఈ సంతోశ్‌బాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు బషీర్, సుష్మ, ఏఈలు కార్తీక్‌రెడ్డి, అజ్మీరా శ్రీకాంత్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో సదుపాయాలు త్వరగా కల్పించండి

నయీంనగర్: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఉనికిచర్ల లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు త్వరగా పూర్తి చేయాలని 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ఉనికిచర్ల 'కుడా' యూనిలేఔట్ ప్లాట్లలో ప్రజల సౌకర్యార్థం కల్పిస్తున్న మౌలిక వసతులు.. డ్రెయినేజీ, విద్యుత్, మంచినీటి సరఫరా పైప్‌లైన్ల ఏర్పాటు తదితర పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో రిజ్వాన్ బాషా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్‌లో మొదటి సారిగా నూతన సాంకేతికతను ఉపయోగించి యూని లేఔట్‌లోని అన్ని ప్లాట్లకు డ్రెయినేజీ, మంచినీటి సరఫరా, విద్యుత్ పైప్‌లైన్లు సమాంతరంగా నాణ్యతతో అండర్‌గ్రౌండ్‌లో అనుసంధానం చేస్తున్నట్లు వివరించారు. పనుల్లో వేగం పెంచి వచ్చే జనవరి మొదటి వారంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వీసీ వెంట 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, డీఈలు, ఏఈలు తదితరులు ఉన్నారు.



హనుమకొండలో భవన నిర్మాణాల కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు

- హాజరుకానున్న 1,83,942 మంది విద్యార్థులు
- కేయూ పరిధి మూడు ఉమ్మడి జిల్లాల్లో 122 సెంటర్లు
- రేపటి నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల కళాశాలల్లో ఈనెల 20 నుంచి డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి శనివారం తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21, 23, 28, 30, జనవరి 3, 5, 9, 11, 16, 18 తేదీల్లో.. ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12, 17, 19, 20, 22, 23, 24 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొత్తం 1,83,942 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారని, ఇందుకు ఉమ్మడి వరంగల్‌లో 46, ఖమ్మంలో 30, ఆదిలాబాద్‌లో 46 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పర్యవేక్షణకు 122 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, అబ్జర్వర్లను నియమించామని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హాల్‌టికెట్లను ఈనెల 18 నుంచి సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చని సూచించారు.

యాసంగికి సాగునీరు

- ఎస్సారెస్పీ, దేవాదుల నీరు విడుదలకు కార్యాచరణ
- మార్చి 15 వరకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన..
- ఈ నెల 18 నుంచి ఎల్‌ఎండీపైన..
- దశలవారీగా అన్ని ప్రాంతాలకు కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఊపందుకున్న సాగు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఈ ఏడాది (2023–24) యాసంగి సాగుకోసం నీటి విడుదలకు యాక్షన్ ప్లాన్ ఖరారైంది. ఉమ్మడి వరంగల్‌లోని యాసంగి పంటలకు నీరందించేందుకు నీటిపారుదలశాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్–1, 2లతోపాటు దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ (స్కివం) ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వం యాసంగి యాక్షన్ ప్లాన్‌కు ఆమోదం తెలిపింది. ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా ఆరు జిల్లాల్లో సుమారు 4.81 లక్షల ఎకరాలకు 'ఆన్ అండ్ ఆఫ్' పద్ధతిన సాగునీరు అందించనున్నారు. మూడు మాసాలు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఈ నెల (డిసెంబర్)18 నుంచి మార్చి 15 వరకు దశలవారీగా రబీసాగు కోసం 8 రోజులు ఆన్, 7 రోజులు ఆఫ్ పద్ధతిన సాగునీటి విడుదలకు సంబంధిత శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నీటి పారుదలశాఖ యాక్షన్ ప్లాన్ ఇదీ..

ఎస్సారెస్పీ ఎల్‌ఎండీ ఎగువ, దిగువన ఉన్న ఆయకట్టుకు ఈ నెల18 నుంచి మార్చి 15వ తేదీ వరకు నీటిని విడుదల చేయనున్నారు. అలాగే దేవాదుల ప్రాజెక్టు కింద 2,02,400 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నారు. ఎస్సారెస్పీ స్టేజ్–1 కింద 8,28,297 ఎకరాలుగా అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. స్టేజ్–1 కింద ఈ ఆయకట్టు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌తోపాటు వరంగల్‌లో ఉంది. అలాగే ఎస్సారెస్పీ స్టేజ్–2 కింద 3,26,914 ఎకరాలను ప్రకటించగా.. ఈ ఆయకట్టు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, కోదాడ వరకూ ఉంటుంది. దేవాదుల ప్రాజెక్టు కింద ఈ యాసంగిలో 2,02,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రబీ ఆరంభానికి ముందే ప్రభుత్వం కేవలం ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచించింది. ఈ మేరకు రబీ సాగుకు అవసరమయ్యే సాగునీటి లభ్యత వివరాలతో ఇరిగేషన్ అధికారులు పంపిన ప్రణాళికలను ప్రభుత్వం ఆమోదించింది. ఇందుకోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 78.66 టీఎంసీలు, లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ)లో 19.42 టీఎంసీలు, మిడ్ మానేరులో 23 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నీటిని రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకునే విధంగా 8 రోజుల ఆన్, 7రోజుల ఆఫ్ పద్ధతిన విడుదల చేయనున్నారు. అదే విధంగా టేలాండ్ (కాల్వ చివరి భూములు) వరకు సాగునీరు వెళ్లేలా అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధమయ్యారు.

వరంగల్ సర్కిల్‌కు 10.77 టీఎంసీలు..

రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ (స్కివం) సమావేశంలో నీటిపారుదలశాఖ వరంగల్ సర్కిల్ పరిధిలోని 1,55,713 ఎకరాల ఆయకట్టుకు 10.77 టీఎంసీల నీటిని వినియోగించనున్నట్లు ప్రకటించారు. ఈ సర్కిల్‌లో మొత్తం 2,79,344 ఎకరాలు ఉండగా.. 2022–23 యాసంగిలో 1,63,842 ఎకరాల సాగు కోసం 11.26 టీఎంసీలు సరఫరా చేశారు. ఈ యాసంగిలో 1,55,713 ఎకరాలకు 10.77 టీఎంసీలు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆయకట్టుకు దేవాదుల, దాని కింద చెరువులు, ఎస్సారెస్పీ స్టేజ్–1, దాని కింది చెరువులు, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించనున్నారు.

యాసంగి పంటలకు 18నుంచి సాగునీరు

యాసంగి పంటలకు ఈ నెల 18నుంచి నీరు విడుదల చేయనున్నాం. మొదటి ఏడు రోజులు డిస్ట్రిబ్యూటరీ 53 ఆయకట్టు పరిధి వరకు. తర్వాతి ఎనిమిది రోజులు డిస్ట్రిబ్యూటరీ 53 కింది ఆయకట్టుకు సరఫరా చేస్తాం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో గత ఏడాది కంటే ఈసారి తక్కువగా నీటి సామర్థ్యం ఉంది. యాసంగి పంటలకు బోటాబోటిగా సరిపోయే నీరు మాత్రమే ఉన్నందువల్ల ఆయకట్టు రైతులు వృథా చేయకుండా వాడుకోవాలి.

– జి.శ్రీనివాస్, ఎస్‌ఈ, ఎస్సారెస్పీ

ఓటరు జాబితా సమగ్రంగా ఉండాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

కాజీపేట: జిల్లాలో ఓటరు జాబితా సమగ్రంగా ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జాబితా పకడ్బందీగా తయారు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి కేంద్ర పథకాలు..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కొత్త లబ్ధిదారులను గుర్తించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ తెలిపారు. 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర నిర్వహణపై కలెక్టరేట్‌లో అధికారులకు అవగాహన కల్పించారు. జనవరి 26 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు గొర్రెకుంట విద్యార్థులు

గీసుకొండ : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్‌లోని గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నలిమెల జ్యోతిర్మయి, పీఈటీ జలగం రఘువీర్ తెలిపారు. ఈ నెల 4న మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి వరంగల్ స్థాయి బేస్‌బాల్ పాఠశాలల(17 ఏళ్ల విభాగం) ఎంపిక క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీచరణ్, ఎల్.అక్షయ్, బి.నందిని ఈనెల 17, 18, 19 తేదీల్లో తొర్రూరు పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను కార్పొరేటర్ మనోహర్, విద్యా కమిటీ చైర్మన్ జున్ను కుమారస్వామి అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ట్రైబల్ యూనివర్సిటీ భూముల పరిశీలన



గట్టమ్మ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ములుగు : జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటునకు లోక్‌సభలో ఆమోదం తెలపడంతో తొలి అడుగు పడింది. కాగా శనివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్, ఉప కులపతి బీజేరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్, ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ అంకిత్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణుగోపాల్ ములుగు మండలంలోని గట్టమ్మ ఆలయం వద్ద గతంలో కేటాయించిన భూమిని పరిశీలించారు. తరగతుల నిర్వహణకు ములుగు మండలం జాకారం సమీపంలోని వైటీసీ భవనాన్ని సందర్శించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి గిరిజన యూనివర్సిటీకి సంబంధించిన వివరాలను అందించారు. హెచ్‌సీయూ అధికారుల వెంట సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ కళ్యాణ్‌రెడ్డి, డీటీడీఓ దేశిరాం, తహసీల్దార్ విజయభాస్కర్, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిష్టతో గోదాదేవి వ్రతం

- నేటినుంచి ధనుర్మాసం ప్రారంభం
- వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్ : సూర్యమానం ప్రకారం సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన సమయాన్ని ధనుర్మాసమని, తిరిగి మకరరాశిలో ప్రవేశించిన సమయాన్ని మకరసంక్రమణమని పిలుస్తారు.. గోదాదేవి ఆచరించి మనకు అందించిన వ్రతమే ధనుర్మాస వ్రతం. నేడు(ఆదివారం) నుంచి వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నాయి. భగవంతుడిని భర్తగా వరించిన గోదాదేవి ధనుర్మాసంలో నిష్టతో ఆచరించిన వ్రతమే ధనుర్మాస వ్రతం. గోదాదేవినే ఆండాళ్ అని పిలుస్తారు. ఈమె భగవంతుడిని పురుషుడిగా, భక్తుడిని స్త్రీగా ఉద్దేశిస్తూ రాసిన తిరుప్పావైలోని 30పాశురాలు భక్తి రసమైనవి. మార్గశిర మాసం శ్రేష్టమైనదని దీక్షతో ధనుర్మాస వ్రతం ఆచరించిన వారికి అద్భుతమైన ఫలితాలు లభిస్తాయని శ్రీకృష్ణ భగవానుడే ఉద్బోధించారు.


ధనుర్మాస వ్రతం..

గోదాదేవి అమ్మవారు తాను ఆచరించి చేయమని చెప్పిన వ్రతం గోదాదేవి వ్రతం. గోదాదేవి తాను ధనుర్మాసంలో తన స్నేహితులతో కలిసి చేసిన పూజా విధానాన్నే నేటికి ఆదర్శనీయంగా నిర్వహించుకుంటారు. దీనినే ధనుర్మాస వ్రతం అని గోదాదేవి వ్రతం అని అంటారు. ఇందులో భాగంగా ఒక్కో రోజు తిరుప్పావైలోని ఒక్కొక్క పాశురాన్ని చదువుతూ నగర సంకీర్తనలు నిర్వహిస్తు స్వామి వారిని అర్చిస్తారు.

ప్రతిరోజు భక్తి పరిమళాలు..

ధనుర్మాసంలో ప్రతిరోజు భక్తులు తెల్లవారకముందే వైష్ణవాలయాలను సందర్శిస్తుంటారు. సాయంత్రం తిరుప్పావై ప్రవచనాలు భక్తిపరిమళాలు వెదజల్లుతుంటాయి. నగరంలోని పలు వైష్ణవ దేవాలయాలలో ఆదివారం నుంచి 2024 జనవరి 15వ తేదీ సోమవారం వరకు ధనుర్మాస పూజలకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలలో భాగంగా 23వ తేదీ శనివారం ముక్కోటి ఏకాదశి ఉత్తరద్వార దర్శనం, 2024 జనవరి 9వతేదీ ఆదివారం తొండరడిప్పాడియాడి యాళ్వారుల తిరు నక్షత్ర మహోత్సవము, 12వతేదీ శుక్రవారం కుడారై ఉత్సవం, 13వతేదీ శనివారం వేంకటేశ్వరస్వామి మాస తిరు నక్షత్రోత్సవం స్వామివారి కల్యాణం, 14వతేదీ ఆదివారం శ్రీగోదా కల్యాణం నిర్వహిస్తారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, అదాలత్ వెనక గల ఎస్వీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవ-అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.





ఎక్సైజ్ కాలనీ వేంకటేశ్వరాలయంలో స్వామివారి మూలవిరాట్, గోదాఅమ్మవారు

భగవంతుడిని నమ్మితే మేలు



భగవంతుడిని నమ్మిన వారికి తప్పక మేలు చేస్తాడు. అపారమైన భక్తితో కొలిచిన, నిర్మలమైన మనస్సుతో పూజించిన వారికి దైవ సాక్షాత్కారం కలుగుతుందని గోదాదేవి అమ్మవారు తెలియ జెప్పింది. భగవంతుని సేవకై దీక్షతో ఉండటమే ధనుర్మాస వ్రతం. అద్భుతమైన ఫలితాలను అందించే వ్రతం ఇది. ప్రతిరోజు చదివే ఒక్కొక్క పాశురానికి ఒక్కో విధమైన శక్తి ఉంటుంది. అలాగే ప్రతిరోజు తీసుకునే ప్రసాదాలలో కూడా ఔషధ పరమైన విలువలు ఉంటాయి. భగవత్ అనుగ్రహాన్ని పొందడానికి మన కోరికలు నెరవేర్చుకోవడానికి ఉత్తమమైనది ధనుర్మాసం.

- ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, ఆధ్యాత్మిక ప్రవచకులు

ధనుర్మాస వ్రతం ఆచరిస్తా..



చిన్నప్పటి నుంచి మా కుటుంబ సభ్యులతో ధనుర్మాసం వ్రతం ఆచరిస్తున్నాను. నెల రోజులు సూర్యోదయానికి ముందే గోదా అమ్మవారికి పూజలు చేసి, తిరుప్పావైలో 30పాశురాలను రోజుకు ఒక పాశురం నెలరోజుల పాటు చదివి, ప్రతిరోజు పాయసన్నంతో పాటు వివిధ రకాల ప్రసాదాలను నివేదన చేస్తాం. వేంకటేశ్వర స్వామి వారి దేవాలయాన్ని సందర్శించి సేవాకాలంలో పాల్గొంటా. భగవంతుడికి భక్తితో పూజ చేస్తే మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది.

- పెరుంబుదూరు గోదాదేవి, గృహిణి, రాంనగర్, హనుమకొండ

విధుల నుంచి వీఓఏ తొలగింపు

- సస్పెన్షన్ కాలంలో వేతనాలు..
- పనులు చేయకుండానే బిల్లులు డ్రా

హసన్‌పర్తి: మండల పరిధి నాగారం ఓం మహేశ్వరి గ్రామైక్య సంఘంలో వీఓఏగా విధులు నిర్వహిస్తూ సస్పెన్షన్‌కు గురైన సాంబయ్యను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాంబయ్య.. ఆఫీస్ బేరర్స్(ఓబీ) సంతకాలు ఫోర్జరీ చేసి సుమారు రూ.9 లక్షలు మాయం చేశాడని వచ్చిన ఆరోపణపై విచారణ చేపట్టిన డీఆర్‌డీఏ అధికారులు 14 నెలల క్రితం అతడిని సస్పెండ్ చేశారు. అయితే ఓ వైపు సస్పెండ్ అయినా సాంబయ్య విధులు నిర్వహిస్తూ వచ్చాడు. అతడికి 2022-23 ఆర్థిక సంవత్సరంలో వేతనం కింద రూ.47,300 చెల్లించారు. సాంబయ్య వీఓ కార్యాలయం ప్రహరీ నిర్మాణానికి రూ.25వేలు డ్రా చేశాడని, ఆడిట్‌లో తప్పుడు బిల్లులు ఉన్నట్లు నిర్ధారించిన వెంటనే ఆ డబ్బులు బ్యాంక్‌లో జమచేసి ఈ ఆర్థిక సంవత్సరంలో గోడ నిర్మించినట్లు మళ్లీ నిధులు డ్రా చేశాడని స్థానికులు ఆరోపించారు. తన భార్య పేరిట రూ.2లక్షలు రుణం పొందినప్పటికీ సక్రమంగా కిస్తీలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ వ్యవహారంలో కింది స్థాయి అధికారులు సాంబయ్యకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదిలా ఉండగా.. సాంబయ్యపై వేటు వేసినప్పటికీ విధులు నిర్వహిస్తున్నాడని స్థానికులు లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జతపరిచారు.

విచారణకు ఆదేశం..

స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్.. డీఆర్‌డీఏ జిల్లా అధికారి శ్రీనివాస్‌కుమార్‌ను ఆదేశించారు. ఈమేరకు విచారణ చేపట్టగా.. సస్పెన్షన్ కాలంలో సాంబయ్య వేతనం తీసుకోవడమే కాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టకుండా నిధులు స్వాహా చేసినట్లు వెల్లడైంది. తీసుకున్న రుణానికి సంబంధించి కిస్తీలు సక్రమంగా చెల్లించలేదని తేలింది. ఈమేరకు డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్‌కుమార్ తొలగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీఎం ప్రభాకర్ తెలిపారు.

వేతనాల చెల్లింపుపై ఆరా?

కాగా, వీఓఏ సాంబయ్యకు వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ మండల అధికారులు ఏం చేశారనే విషయంపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఆయనకు.. మండల అధికారులకు ఏమైనా సంబంధం ఉందా? అనే విషయమై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

బోధన, పరిశోధన నైపుణ్యాలు పెంచుకోవాలి

కేయూ క్యాంపస్ : జాతీయ నూతన విద్యావిధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు బోధన పద్ధతులు, పరిశోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నర్సింహచారి సూచించారు. కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో పరిశోధన పద్ధతులు -నివేదిక రచనపై యూనివర్సిటీ పరిధిలోని ఎంకాం, ఎంబీఏ కోర్సులు నిర్వహిస్తున్న యూనివర్సిటీ పీజీ కళాశాలల అధ్యాపకులకు శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ కట్ల రాజేందర్ మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న అధ్యాపకులకు ప్రాజెక్టు గైడ్‌గా నిర్వహించేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రాజెక్టు రిపోర్ట్ తయారీలో వచ్చిన మార్పులను అనుగుణంగా అధ్యాపకులు తమ విద్యాబోధన, ప్రాజెక్టుల రూపకల్పనలోనూ మార్పులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యేక ఉపన్యాసకుడిగా అడ్జెంట్ ప్రొఫెసర్ కృష్ణమాచార్య మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న నూతన మార్పులు.. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా పరిశోధనల్లోనూ వినూత్నంగా ఉండాల్సిన అవసరం ఉందని వివరించారు. వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ వరలక్ష్మి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ అమరవేణి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నర్సింహచారి

శ్రీనివాస్‌రెడ్డికి ఎంసీహెచ్ పట్టా



సాక్షి, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి దేశంలోనే ప్రఖ్యాతి చెందిన సంజయ్ గాంధీ పోస్టు గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల లక్నో నుంచి అరుదైన మెగిస్టర్ చిరూర్ గియే(ఎంసీహెచ్) డాక్టర్ చదువును పూర్తి చేసి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. మారుమూల గ్రామంలో పుట్టిన శ్రీనివాస్ రెడ్డి చిన్నతనం నుంచి డాక్టర్ కావాలని కలలు కన్నారు. దానికి అనుగుణంగా పాఠశాల విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు హనుమకొండలో చదివారు. హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పట్టాను పొందారు. అనంతరం ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంఎస్ జనరల్ సర్జన్ పూర్తి చేశారు. తర్వాత వైద్య విద్యలో ప్రాముఖ్యత గల ఎంసీహెచ్ చదివేందుకు 2020లో నీట్ అర్హత పరీక్ష రాసి జాతీయ స్థాయిలో నాల్గొవ ర్యాంకు సాధించారు. దీంతో దేశంలోని ప్రఖ్యాత సంజయ్ గాంధీ మెడికల్ సైన్స్ కళాశాల లక్నోలో చేరారు. అక్కడే ఎంసీహెచ్ విద్యను పూర్తి చేసి శనివారం విశ్వవిద్యాలయం ప్రెసిడెంట్, ప్రొఫెసర్ల బృందం చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు. వైద్య విద్యలో పేరుగాంచిన ఎంసీహెచ్ పట్టాను పొందిన శ్రీనివాస్‌రెడ్డిని తల్లిదండ్రులు వెంకట్ రెడ్డి, సుమతి, అత్తామామలు జగదీశ్వర్‌రెడ్డి, హైమావతి, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందించారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్‌రెడ్డి(ఫైల్)

ధర్మసాగర్ : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని క్యాతంపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. క్యాతంపల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల సుధాకర్ రెడ్డి (63) గతంలో ఓ వ్యక్తి వద్ద 13 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అదే సమయంలో బయానగా రూ.5 లక్షలు చెల్లించాడు. మిగతా డబ్బులు చెల్లించి భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా భూమి అమ్మిన వ్యక్తి నిర్లక్ష్యం చేశాడు. దీంతో గ్రామంలోని పెద్ద మనుషులను సంప్రదించగా ఈ నెల 4వ తేదీన బయానగా ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లిస్తానని చెప్పాడు. 5వ తేదీన సుధాకర్‌రెడ్డి సదరు వ్యక్తిని డబ్బులు ఇవ్వాలని కోరగా అతను డబ్బులు ఇవ్వను దిక్కున్నచోట చెప్పుకోమని దబాయించాడు. దీంతో మనస్తాపం చెందిన సుధాకర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో తన చావుకు కారణం రాసి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ రావు తెలిపారు.

భర్త పట్టించుకోవడం లేదని వివాహిత..

బయ్యారం : ప్రేమించి పెళ్లాడిన భర్త మద్యానికి బానిసై గొడవ పడుతున్నాడని ఆవేదనతో భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వెంకట్రాంపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇనుగుర్తి రోహిణి(26) ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన హరీష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకోగా వీరికి ఒక పాప సంతానం. హరీష్ మద్యానికి అలవాటు పడి తనను సరిగా పట్టించుకోవడం లేదని రోహిణి ఆవేదన చెందింది. దీంతో గురువారం మద్యం తాగి వచ్చిన హరీష్ భార్యతో గొడవ పడగా మనస్థాపానికి గురైన రోహిణి పురుగులమందు తాగింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మృత్యు'దారులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతిచెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి చెందిన ఇద్దరు, మహదేవపూర్ మండలానికి చెందిన మహిళ, వరంగల్ జిల్లా ఖానాపురం మండలానికి చెందిన ఒకరు, మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందిన ఓ అయ్యప్ప మాలధారుడు ఆయా ప్రమాదాల్లో మరణించారు.

ఖానాపురం : రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం పక్కన పెట్టిన రాయి తగిలి వాహనం అదుపు తప్పి గ్రామపంచాయతీ ట్యాంకర్‌ను ఢీకొట్టిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని మంగళవారిపేట గ్రామానికి చెందిన ఆబోతు సాంబరాజు(32) నర్సంపేట శివారులోని ఓ రైస్‌మిల్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మరావుపేట శివారులో మిల్లులో పని చేస్తున్న కొడ్తిమాటుతండాకు చెందిన భూక్య యాదమ్మ, భూక్య భద్రి మిల్లుకు వెళ్లడానికి మంగళవారిపేటలో సాంబరాజు ద్విచక్ర వాహనం ఎక్కి బుధరావుపేటకు వెళ్తున్నారు. గ్రామ శివారుకు రాగానే రోడ్డుపక్కన ధాన్యానికి అడ్డుగా పెట్టిన రాయిపైకి ద్విచక్ర వాహనం ఎక్కింది. దీంతో అదుపుతప్పి రోడ్డుపక్కనే నిలిపిన గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సాంబరాజు తలకు, ఛాతీకి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా యాదమ్మ, భద్రిలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన మహిళలను చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య మల్లికాంబ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ పుల్యాల కిషన్, ఎస్సైలు మాధవ్, నగేష్, పరమేష్ సంఘటన స్థలానికి చేరుకోని వివరాలు సేకరించారు. మృతికి కారణమైన ధాన్యం యజమాని భద్రు, గ్రామ పంచాయతీపై చర్యలు తీసుకోవాలని మృతుని భార్య మల్లికాంబ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యాయం చేయాలని రాస్తారోకో..

ఉదయాన్నే మిల్లు పనికి వెళ్తున్న సాంబరాజు రోడ్డు పక్కన పెట్టిన రాళ్లు తగిలి మృతి చెందడంతో బంధువులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కనే జీపీ ట్యాంకర్ లేకున్నా బతికేవాడంటూ కుటుంబ సభ్యులు రోదించిన తీరు కన్నీరుపెట్టించింది. గ్రామ పంచాయతీతో పాటు సదరు రైతు వద్ద నుంచి పరిహారం అందించాలని గ్రామస్తులు మృతదేహంతో రాస్తారోకోకు దిగారు. ట్రాక్టర్‌లో వేసిన మృతదేహాన్ని పోస్టుమార్టంకు వెళ్లనీయకుండా అడ్డుకోని సుమారు గంట పాటు రాస్తారోకో చేశారు. మండల, పంచాయతీ అధికారులు వచ్చి బాధ్యత వహించాలని భీష్మించారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. గ్రామస్తులతో సీఐ కిషన్, ఎస్సై మాధవ్‌లు చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



రాస్తారోకో చేస్తున్న బంధువులు, ప్రజలు



సాంబరాజు(ఫైల్)

వేములవాడకు వెళ్తుండగా..

టేకుమట్ల : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని తాడికల్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన మ్యాడగాని శ్రావణ్(32) హైదరాబాద్‌లో ట్యాక్సీ నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి హనుమకొండ వచ్చి తమ సమీప బంధువులైన బొల్లికొండ ఆకాష్(22)తో పాటు పైడిపెల్లి రాకేష్‌తో కలిసి కారులో వేములవాడకు వెళ్తుండగా తాడికల్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో శ్రావణ్, ఆకాష్‌లు అక్కడికక్కడే మృతి చెందగా రాకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాకేష్‌ను హైదరాబాద్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా పోలీసులు పొక్లెయినర్ సహాయంతో లారీ ముందు భాగంలో చిక్కుకున్న కారును వేరు చేసినట్లు తెలిపారు.



శ్రావణ్(ఫైల్) ఆకాష్(ఫైల్)


అయ్యప్ప మాలధారుడు..



వెంకన్న(ఫైల్)

బయ్యారం : 'దేవుడిని నమ్మి మాల ధరిస్తే.. ఇలా మాలలోనే తమకు దక్కకుండా పోతాడను కోలే' అంటూ ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుర్సం వెంకన్న భార్య కార్తీక విలపిస్తున్న తీరు పలువురి హృదయాలను కలిచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన కుర్సం వెంకన్న (40) మహబూబాబాద్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. 16 రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించాడు. ఈ క్రమంలో బయ్యారం గ్రామానికి చెందిన కోళ్ల వ్యాన్‌కు శుక్రవారం రాత్రి క్లీనర్‌గా వెళ్లాడు. కాగా కామేపల్లి మండలం మద్దులపల్లి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో వ్యాన్‌లో ఉన్న వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వాహనం ఢీకొని మహిళ..



రాజమణి(ఫైల్)

మహదేవపూర్ : మండలంలోని సూరారం సమీపంలో వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన ముల్కల రాజమణి(46) రైతు వేదిక వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి వస్తోంది. అంబట్‌పల్లి వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఎర్టీగా వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ ప్రణీత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సంఘటన స్థలం వద్ద వినయ్ మృతదేహం



వినయ్(ఫైల్)

నడికూడ : అప్పటి వరకు పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని రామకృష్ణాపూర్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన ఎరుకల(ముస్కే) కృష్ణమూర్తి కుమారుడు వినయ్(20) తమ పొలంలో సొంత ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్నాడు. రోటవేటర్‌తో బురద దున్నుతున్న క్రమంలో పొలంలో నుంచి పక్క రైతు బావికి భూమి పై ఆనుకొని విద్యుత్ సర్వీస్ వైర్ అమర్చారు. అది గమనించని వినయ్ ప్రమాదవశాత్తు సర్వీస్ వైర్ ట్రాక్టర్ రొటవేటర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు దామెర ఎస్సై అశోక్ తెలిపారు.